TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 218 | శుక్రవారం 31-07-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

# మోదీ అధ్యక్షతన రక్షణ వ్యవహారాలపై

## క్యాబినెట్ కమిటీ కీలక భేటీ



**మోదీ అధ్యక్షతన రక్షణ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ కీలక భేటీ**

- మోదీ అధ్యక్షతన జజూ భేటీ
- ఇరాన్--అమెరికా ఉద్రిక్తతలపై చర్చ
- దేశ భద్రతపై సమీక్ష
- హర్మూజ్ పరిస్థితులపై ఆరా
- చమురు రవాణాపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యామ్నాయ సముద్ర మార్గాల పరిశీలన
- దిగుమతులు--ఎగుమతులపై సమీక్ష
- విదేశాల్లో భారతీయుల భద్రతపై చర్చ
- కీలక శాఖల ప్రజెంటేషన్లు
- పలువురు కేంద్ర మంత్రులు హాజరు

2లో

# ప్రశ్నలు రూపొందించిన వారే అనువదించారు!

## - 'నీట్' లీకేజీకి కీలక కారణం




2లో

# ఇ-20 పెట్రోల్‌తో

## మైలేజీ తగ్గుతుంది.. కానీ: గడ్కరీ



2లో

# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

## కార్పోరేట్‌కు దీటుగా పాఠశాలల అభివృద్ధి



తెలంగాణను విద్యాపరంగా అగ్రగామిగా నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. స్కూళ్లను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో ఏకంగా 9 శాతం నిధులను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల రాజకీయం కోసం కాకుండా, పిల్లల బంగారు భవిష్యత్తును దిద్ది తీర్చాలనే ఏకైక లక్ష్యంతోనే విద్యాశాఖ బాధ్యతలను తాను స్వయంగా పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్నవారు ఇరిగేషన్ శాఖను ఎంచుకుంటే, నేను విద్యాశాఖ బాధ్యతను నా వద్దే ఉంచుకున్నా. 80 వేల పుస్తకాలు చదివానన్న నాయకుడి కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయింది.

2లో

- పిల్లల భవిష్యత్ తీర్చి దిద్దేందుకే విద్యాశాఖ చూస్తున్నా
- పిల్లలను హాస్టళ్లలో వేయడంతో దెబ్బతింటున్న కుటుంబ బంధాలు
- మండలం క్లస్టర్‌గా విద్యా ప్రణాళిక రూపొందిస్తున్నాం
- ఉపాధ్యాయుల పదోన్నతలపై అనుమానాలు వద్దు
- 2034 వరకు నేనే ముఖ్యమంత్రిగా ఉంటా
- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

# నేరస్తులను కాపాడడమే వైఎస్సార్‌సీపీ నైజం



- మంత్రి కొలుసు పార్థసారథి
- పేదవాడి ప్రాణాల కంటే నేరస్థులకు కొమ్ముకాయడం దారుణం
- రక్షణ కల్పించే పోలీసులపై దాడులు ఖండనీయం
- బాధిత గొర్రెల కాపరి కుటుంబానికి రూ.10 లక్షల సాయం
- బాధిత కుటుంబానికి సొంత ఇల్లు కట్టిస్తాం
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు

2లో

# ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద.. 30 గేట్లు ఎత్తి నీరు విడుదల



2లో

పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. అధికారులు 30 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

# వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు



- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు
- అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

2లో

వాయుగుండం ప్రభావం నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకావంఉండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక చేసింది. ఈ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకొని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని

# ఆపదలో ఉన్నవారికి సాయం చేయడమే సంతృప్తి

## నారా భువనేశ్వరి

- ఎన్టీఆర్ ట్రస్ట్‌తో 29 ఏళ్లుగా ప్రజాసేవ
- కుప్పం ప్రజల ప్రేమాభిమానాలే కొండంత బలం
- మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి
- టీం వర్క్‌తోనే విజయాలు సాధ్యం
- అనారోగ్యంతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ

2లో



# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

- అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాల స్వీకరణ
- జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సుల నిర్వహణ
- అధికారులతో సమీక్షించిన మంత్రి సీతక్క


అంగన్‌వాడీ వ్యవస్థను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. అందులో భాగంగా అంగన్‌వాడీ టీచర్ల నుంచి నేరుగా సలహాలు, సూచనలు స్వీకరించేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి సీతక్క ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సమస్యలను తక్షణమే గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీచర్లు, ఆయాలకు అందించే నూతన యూనిఫామ్‌లను పరిశీలించి, అక్టోబర్ మొదటి వారంలోగా వాటిని సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రస్తుతం 17 ఉన్న శిశు దత్తత కేంద్రాలను విస్తరించి ప్రతి జిల్లాలోనూ ఒక అడాప్షన్ సెంటర్ ఉండేలా చూడాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి సంబంధించి ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు ఇచ్చామని అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో కలెక్టర్లతో మాట్లాడి నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.


2లో



# సంపాదకీయం

## ప్రతిఘటనతోనే ప్రజాస్వామ్యం పునరుద్ధరణ




రాజ్యాంగబద్ధ ప్రజాస్వామిక సమాజంలో వీధి నిరసన న్యాయసమ్మతమేనా? ఎన్నికలలో పోటీచేయడానికే ప్రాధాన్యమివ్వడం కాకుండా శాంతియుత, ప్రజాస్వామిక ప్రతిఘటనే ప్రతిపక్షాల పురోగతికి సరైన మార్గమని నేను ఇదే కాలమ్‌లో చేసిన వాదనకు ప్రతిస్పందనగా పలువురు నాకు ఆ ప్రశ్న వేశారు. భారతీయ జనతా పార్టీ ఐటీ సెల్ చీఫ్, దర్బారీ మీడియా యాంకర్--ఇన్--చీఫ్, అధికార పార్టీని సమర్థించే విద్యావేత్తలు నా వాదనపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఆ వాదన ప్రజాస్వామ్య వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, జాతి--వ్యతిరేకమని తప్పుపట్టారు.

అసాధారణంగా జరిగిన యువజనుల నిరసన పాలక పార్టీ వర్గాలకు కలిగించిన నిరుత్సాహం నుంచే ఆ విమర్శలు వచ్చాయనేది స్పష్టం. ప్రజల్లో ప్రగాఢంగా ఉన్న భయసంకోచాలకు తెరదించిన అపూర్వ ప్రజా నిరసన అది. నా వాదనపై వచ్చిన విమర్శల్లో నిజాయితీ లోపించింది. విమర్శకులు చాలా తెలివిగా, తమకు అనుకూలంగా నా వాదనలోని 'శాంతియుత, ప్రజాస్వామిక' అనే పదబంధాన్ని విస్మరించారు. ప్రజల్లో విభేదాలు సృష్టించి, మత సామరస్యాన్ని దెబ్బతీసిన రథయాత్రతో అధికారానికి వచ్చినవారు, న్యాయ, రాజ్యాంగ నియమాలను ఉల్లంఘించినవారు వ్యవస్థలను గౌరవించడం గురించి ఉపన్యాసాలు ఇవ్వడం ప్రారంభించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించినవారు, సామాజిక న్యాయ భావననే అంగీకరించనివారు స్వతంత్ర భారతదేశంలో పౌర శాసనోల్లంఘనకు వ్యతిరేకంగా అంబేడ్కర్ చేసిన వాదనలను ఉటంకిస్తున్నారు.

వాళ్ల విమర్శలు ఇలా ఉన్నాయి: ఒక ప్రజాస్వామిక వ్యవస్థలో ఒక సమస్యను, ఎన్నికైన ప్రజాప్రతినిధులను విస్మరించి, రాజ్యాంగ సంస్థలను ఉపేక్షించి, వీధి నిరసన ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రజలను సమీకరించడం సమర్థనీయమేనా? సమస్యలు, వివాదాలను పరిష్కరించుకునేందుకు రాజ్యాంగ సంస్థలను గౌరవించవలసిన అవసరం లేదా? వీధి నిరసనలు అంటే మూకస్వామ్యాన్ని స్వాగతించడం కాదా? మూకస్వామ్యం ప్రబలమయితే నిర్ణయాలు సహేతుకంగా తీసుకోవడం ఎలా సాధ్యమవుతుంది? మూకస్వామ్యం అరాచకానికి దారితీసి రాజ్యాంగబద్ధ పాలనను అసాధ్యం చేయదా? ఇది సమాజంలోని అణగారిన వర్గాల శ్రేయస్సుకు ఎలా దోహదం చేస్తుంది?

ఈ ప్రశ్నలు నిరపాయకరమైనవిగా కనిపిస్తున్నాయి. అయితే వాటిలో లోపాలు ఉన్నాయి. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు సక్రమంగా పనిచేస్తాయనే సునిశ్చిత విశ్వాసంతోనే ఆ ప్రశ్నలు వేయడం జరిగింది. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో సంస్థలు, వ్యవస్థలు సక్రమంగా ఉంటాయనేది ఒక మిథ్య. సమీకృతమైన ప్రజలు ఉన్మాద హంతక మూకలు కారు. ఒక ఉమ్మడి లక్ష్యంతో అనియతంగా సమావేశమైన జన బాహుళ్యమది. అలిఖిత నైతిక నియమావళి వారి ప్రవర్తనను నిర్దేశిస్తుంది. దీనిని మరింత వివరంగా చూద్దాం.

ఆధునిక ప్రజాస్వామ్యాలు ప్రారంభంకాక ముందు లేదా వాటి తొలిదశలో ప్రజా సమూహాలు అందరికీ ఆమోదయోగ్యమైన, అప్పటికే సంప్రదాయపరంగా ఉన్న హక్కులను, పద్ధతులను అనుసరించేవని చరిత్రకారులు వివరించారు. 18వ శతాబ్దిలో ఇంగ్లాండ్‌లోని పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అప్పటి ప్రజలు లాభాపేక్షలేని 'నైతిక ఆర్థిక వ్యవస్థ'ను (మోరల్ ఎకానమీ) కోరుకున్నారని ఈపీ థాంప్సన్ వివరించారు. సమష్టి శ్రేయస్సుకు భంగం కలగని రీతిలో ప్రజలు తమ ఆర్థిక, సామాజిక జీవితంలో వ్యవహరించేవారని ఆయన పేర్కొన్నారు. కాబట్టి, పాలనలో ప్రజల భాగస్వామ్యం అన్న భావనను ఉదారవాద ప్రజాస్వామ్యం కొత్తగా ఆవిష్కరించలేదు. సుదీర్ఘకాలంగా ఆచరణలో ఉన్న అసెంబ్లీలు, పిటిషన్లు, ప్రజాసమూహాల ఉమ్మడి నిరసన మొదలైన పద్ధతులను ఆధునిక ప్రజాస్వామ్యాలే వ్యవస్థీకృతం చేశాయి.

అందువల్ల, ప్రజాప్రతిఘటన లేదా 'కలహశీల రాజకీయాల'ను ఆధునిక ప్రజాస్వామ్యాలు రూపుమాపలేవు. ప్రజాస్వామ్యం పనిచేసే తీరుతెన్నులలో అవి అంతర్భాగాలు. జవాబుదారీతనంతో కూడిన క్రమబద్ధమైన ప్రజాస్వామిక ఆచరణతో పాటు క్రమపద్ధతిలో లేని సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణ కూడా పనిచేసే ప్రజాస్వామ్య సజీవ లక్షణం. నిరసన ప్రదర్శనలు, సమ్మెలు, ధర్నాలు, బాయ్‌కాట్‌లు, శాసనోల్లంఘన మొదలైన అనియత పద్ధతుల రూపేణా తమ డిమాండ్లను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లేందుకు సామాన్య పౌరులు ప్రయత్నిస్తుంటారు. ప్రజా ఉద్యమాలు ప్రజాస్వామిక వైఫల్యానికి చిహ్నాలు కావని పశ్చిమ యూరోప్‌లో గత అయిదు శతాబ్దాల కాలంలో సామాన్య ప్రజల ఉమ్మడి కార్యాచరణను నిశితంగా అధ్యయనం చేసిన చార్లెస్ టిల్లీ అనే చరిత్రకారుడు అభిప్రాయపడ్డారు. ప్రజాఉద్యమాలు వాస్తవానికి ప్రజాస్వామిక పాలన పరిణామ క్రమంలో ఉద్భవించినవేనని ఆయన అన్నారు. అవి వ్యవస్థ పట్ల శత్రుపూర్వకమైనవి కావు. ప్రజా నిరసనలు తరచూ వ్యవస్థాగత సంస్కరణలకు దారితీస్తాయి. వ్యవస్థల సానుకూల ప్రతిస్పందన ప్రజలు మరింతగా సంఘటితమయ్యేందుకు ఉద్దీపన అవుతుందని చార్లెస్ టిల్లీ నిర్ధారించారు.

గ్లోబల్ సౌత్ (ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా) ప్రజాస్వామిక వ్యవస్థల్లో ప్రజాసమీకరణల ప్రత్యేక పాత్రను గుర్తించడం చాలా ముఖ్యం. 20వ శతాబ్దంలో వలసపాలన నుంచి విముక్తమైన చాలా దేశాలు ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని అనుసరించాయి. అయితే చాలా దేశాలలో ఆ పాలనా పద్ధతులు ప్రభావశీలంగా అమలయేందుకు అవసరమైన సంస్థాగత ప్రాతిపదికలు బలహీనమైనవి. భారత్ లాంటి ప్రజాస్వామిక సమాజంలో ప్రజా ఉద్యమాలు, నిరసనలు సంస్థాగత లోపాలు, లొసుగులను అధిగమించేందుకు దోహదం చేస్తున్నాయి. భారత్‌లో పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లే ప్రజా నిరసనలు సంస్థాగత వైఫల్యాలకు అత్యవసర ప్రతిస్పందనలు కావని, భారత ప్రజాస్వామ్య తార్కికతలో అవి అంతర్భాగాలని దీపేశ్ చక్రవర్తి అన్నారు. సమస్యల పరిష్కారానికి రాజ్య వ్యవస్థపై ఒత్తిడి తెచ్చేందుకు మూకుమ్మడి నిరసనలు అనేవి ప్రభావశీలంగా పనిచేస్తున్నాయి, సందేహం లేదు. అసమానతల సమాజంలో ప్రజా నిరసనలు ప్రజాస్వామ్య పరిపుష్టికి తోడ్పడతాయని, అవి ప్రజాస్వామ్యానికి ప్రతికూలతలు కావని భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలలో ప్రజా ఉద్యమాలను తులనాత్మకంగా అధ్యయనం చేసిన పాట్రిక్ హెల్లర్ అభిప్రాయపడ్డారు.న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోటెత్తిన యువజనుల నిరసన అసాధారణ నేపథ్యాన్ని మనం అంగీకరించాలి. వర్తమాన భారతదేశం సాధారణంగా పనిచేస్తున్న ప్రజాస్వామ్యం కాదు. ప్రజాస్వామిక జవాబుదారీతనం, ప్రతిస్పందనాత్మక స్వభావం కనిపించని కాలమిది. అవధులు లేని సంపూర్ణ అధికారాలకు పాలకులు ఆరాటపడుతున్నారు. తమ విధానాలపై ప్రజల అభిప్రాయాలను అలక్ష్యం చేస్తున్నారు. ప్రధాన స్రవంతి మీడియా ప్రభుత్వానికి పూర్తి విధేయత చూపుతోంది. పాలనపై విమర్శలకు ప్రాధాన్యమివ్వడం లేదు. అలాగే రాజ్యాంగబద్ధ సంస్థలూ అధికారపక్షం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నాయి.

# నేరస్తులను కాపాడడమే వైఎస్సార్‌సీపీ నైజం

మొదటిపేజీ తరువాయి

**మంగళగిరి, జూలై 30 :**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు మంచి భవిష్యత్తును, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా వేగంగా అడుగులు వేస్తోందని గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అభివృద్ధిపై వస్తున్న మంచి పేరును చూసి ఓర్వలేక వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల దృష్టిని మరల్చేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. పేద గొర్రెల కాపరి దానయ్య మరణానికి కారణమైన నిందితుడిని పరామర్శించడానికి వెళ్లడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు.

**మహిళా అధికారిపై దాడి దారుణం**
భద్రతా విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారిపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. విధులు నిర్వర్తిస్తున్న మహిళా అధికారిపై పిడిగుద్దులు కురిపిస్తూ దాడి చేయడం ఆ పార్టీ నేర ప్రవృత్తికి నిదర్శనమని మండిపడ్డారు. చట్టాన్ని తొంగలో తొక్కి దౌర్జన్యాలు చేసే పార్టీకి ప్రజాస్వామ్యంలో ఉండే అర్హత లేదన్నారు.

**బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం**
చనిపోయిన పేద గొర్రెల కాపరి దానయ్య కుటుంబాన్ని ఏ ఒక్క వైఎస్సార్‌సీపీ నాయకుడూ పట్టించుకోలేదని విమర్శించారు. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించారని, బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరపున రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. హౌసింగ్ డిపార్ట్‌మెంట్ తరపున ఆ కుటుంబానికి సొంత ఇల్లు కట్టించి ఇస్తామని ప్రకటించారు.

**అభివృద్ధిని తొక్కేయడానికే ఈ డ్రామాలు**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తూ వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తుంటే, ఆ అభివృద్ధి చర్చను తొక్కేయడానికే జగన్ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ఆపదలో ఉన్నవారికి సాయం చేయడమే సంతృప్తి

మొదటిపేజీ తరువాయి

**కుప్పం, జూలై 30 :**
ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి సాయం చేయడంలోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌లో 29 ఏళ్లుగా తన ప్రయాణం ప్రజాసేవకే అంకితమైందని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్లు, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు, వినికిడి యంత్రాలను ఆమె పంపిణీ చేశారు.

**మహిళలకు ఆర్థిక చేయూత**
కుటుంబం సంతోషంగా ఉండాలంటే మహిళల పాత్ర కీలకమని భువనేశ్వరి తెలిపారు. మహిళలకు ఉపాధి అవకాశాలు, ఆర్థిక చేయూత కల్పించేందుకు కుప్పంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్పత్తుల విక్రయాల ద్వారా వచ్చే లాభాన్ని తిరిగి మహిళలకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

**సమష్టి కృషి ఎంతో అవసరం**
ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించాలంటే సమష్టి కృషి ఎంతో కీలకమని భువనేశ్వరి అన్నారు. చల్లపల్లి ఎన్టీఆర్ స్కూల్ ద్వారా అనాథ పిల్లలకు ఉచితంగా విద్యను అందిస్తున్నందుకు ఎంతో సంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌కు దాతలు అందిస్తున్న సహాయం మరువలేనిదని తెలిపారు.

**కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ**
కుప్పంలో పలు ఆలయాలను దర్శించుకున్న భువనేశ్వరి, అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ కార్యకర్తలు అన్వార్ బాషా, చిన్ని నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు

మొదటిపేజీ తరువాయి

గురువారం రెవెన్యూ, విపత్తు నిర్వహణ (డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గడచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు అందించాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జిహెచ్ ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్ట్‌లు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

# ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద.. 30 గేట్లు ఎత్తి నీరు విడుదల

మొదటిపేజీ తరువాయి

పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. అధికారులు 30 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 4.50 లక్షల క్యూసెక్కులు, ఔట్ ఫ్లో మొత్తం 3.90లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి సామర్థ్యం 20.17 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం నీటి నిల్వ 19.70 టీఎంసీలుగా ఉంది. గేట్లు ఎత్తిన నేపథ్యంలో ఎల్లంపల్లి ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. మత్స్యకారులు, రైతులు గోదావరిలోకి వెళ్లొద్దని సూచించారు.

# మోదీ అధ్యక్షతన రక్షణ వ్యవహారాలపై

మొదటిపేజీ తరువాయి

దిల్లీ: ప్రధాని మోదీ అధ్యక్షతన రక్షణ వ్యవహారాలపై క్యాబినెట్ కమిటీ సమావేశమైంది. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరోసారి పతాకస్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ప్రస్తుతం కొనసాగుతున్న అంతర్జాతీయ సంఘర్షణలు, వాటి వల్ల కలిగే భద్రతాపరమైన పరిణామాలు, దేశ ఎగుమతులు, దిగుమతుల్లో ఏర్పడే అంతరాయాలు, విదేశాల్లోని భారతీయ పౌరుల భద్రత, నావికుల రక్షణ గురించి ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది.

భారత్‌కు చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్‌లో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో భారత్‌కు సరకు రవాణాలో ఇబ్బందులు ఎదురవ్వకుండా తీసుకుంటున్న చర్యలపై ప్రధాని ఆరా తీసినట్లు సమాచారం. నల్ల సముద్రం, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఎడెన్ మార్గాలను ప్రత్యామ్నాయంగా ఉపయోగించుకోవడంపైనా చర్చించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పెట్రోలియం, సహజవాయువు, ఎరువులు తదితరాల దిగుమతికి తీసుకుంటున్న చర్యలపై ఆయా శాఖలు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ రాజకీయ పరిస్థితులు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ భేటీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగశాఖ మంత్రి జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, నౌకాయాన శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్, పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి పాల్గొన్నారు.

# ప్రశ్నలు రూపొందించిన వారే అనువదించారు!

మొదటిపేజీ తరువాయి

ప్రశ్నపత్రాల రూపకల్పనలో భాగస్వాములైన నిపుణులే వాటిని అనువాదం చేయడం నీట్ పేపర్ లీక్‌కు కారణాల్లో ఒకటని తెలిసింది. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కి సీబీఐ అనధికారికంగా తెలియజేసిందని, అధికారిక సిఫార్సుల్లోనూ దీనిని పొందుపరచనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

పశ్నపత్రం రూపకల్పన సమయంలో నిపుణులను ప్రతిరోజూ ఇంటికి తిరిగి వెళ్ళడానికి అనుమతించారు. ఇందులో భాగస్వాములైన వారిలో కొందరు ఆ ప్రశ్నలను గుర్తుపెట్టుకొని, వాటిని ప్రైవేటు కోచింగ్ తరగతులకు హాజరయ్యే కొంతమంది విద్యార్థులతో పంచుకున్నారు. అయితే, వారికి ఇవే ప్రశ్నలు వస్తాయని నేరుగా చెప్పకుండా 'అతి ముఖ్యమైనవి' అని చెప్పారు. భౌతిక, రసాయన, జీవశాస్త్ర పేపర్లు రూపొందించిన ముగ్గురు మహారాష్ట్రకు చెందిన ఉపాధ్యాయులు ఇందుకు బాధ్యులుగా సీబీఐ గుర్తించింది.

నీట్-2026లో చోటుచేసుకున్న అవకతవకలు, 2024లో జరిగిన లీకేజీకి పూర్తి భిన్నమని దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. గతంలో ఓ లీకేజీ ముఠాతో ఒక పరీక్షా కేంద్రం నిర్వాహకుడు కుమ్మక్కై ప్రశ్నాపత్రాల చోరీ చేసి పంపిణీ చేసినట్లు తెలిపాయి. నాటి కేసును దర్యాప్తు చేసిన సీబీఐ.. ప్రశ్నపత్రం తరలింపులో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ఎన్‌టీఏకు అనేక సూచనలు చేసినా తాజాగా లీకేజ్ చోటుచేసుకోవడం గమనార్హం.

మరోవైపు, ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేసిన సీబీఐ.. ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసింది. అందులో ప్రస్తావించిన 13 మంది నిందితులు ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

# ఇ-20 పెట్రోల్‌తో

## మైలేజీ తగ్గుతుంది.. కానీ: గడ్కరీ

మొదటిపేజీ తరువాయి

20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇ-20 పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ 2 నుంచి 6 శాతం మేర తగ్గుతుందన్నారు. వాహన రకం, అది ఏ సంవత్సరంలో తయారైంది? అనే దానిపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ మేరకు పార్లమెంట్‌లో ఓ ఎంపీ అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

ఇ-20 వాడకం వల్ల వాహనంలో గానీ, ఇంజిన్‌లో గానీ ఇప్పటివరకు ఎలాంటి సమస్యలు తలెత్తలేదని గడ్కరీ అన్నారు. ఇ-10 ఇంధనంతో పోలిస్తే ఇ-20 పెట్రోల్ 30 శాతం కర్బన ఉద్గారాలను తగ్గిస్తుందన్నారు. అంతేకాకుండా యాక్సిలరేషన్ మెరుగవుతుందన్నారు. బీఎస్-×××, బీఎస్-×ఎ, బీఎస్ -ఎ× ఈ10 (గ్యాసోలిన్) టూ వీలర్, ఫోర్ వీలర్ వాహనాల్లో ఇ20 పెట్రోల్ వాడకాన్ని అంచనా వేయడానికి ఞూ=ఞూ×, ఞ×ఞూవీ, ×ఞూజ సంయుక్తంగా ఓ అధ్యయనం జరిపాయన్నారు. వాహన నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని, ఇంధన సామర్థ్యం తగ్గుతుందంటూ వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు.

ఇథనాల్ బ్లెండెడ్ ప్రోగ్రామ్ 2001లోనే పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభమైందని మంత్రి గుర్తు చేశారు. 2006లో ఇ5 (ఇథనాల్ 5 శాతం) తీసుకురాగా.. ఉత్పత్తి సామర్థ్యం మేరకు క్రమక్రమంగా పెంచుకుంటూ వచ్చినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇ20 ఇథనాల్‌తో నడుస్తున్నాయని, ఆ వాహనాల్లో ఇప్పటివరకు ఎలాంటి సమస్యా తలెత్తలేదని మరోసారి స్పష్టం చేశారు.

# అంగన్‌వాడీ వ్యవస్థ మరింత బలోపేతం

మొదటిపేజీ తరువాయి

అంగన్‌వాడీల్లో పిల్లలకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ నిధులు ల్యాప్స్ కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని అధికారులకు నిర్దేశిరచారు. అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాల వారీగా అంగన్వాడీ టీచర్లు, ఆయాలతో సదస్సులు నిర్వహించి వారి సూచనలు స్వీకరించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, ఆయాల యూనిఫార్మ్‌లను అక్టోబర్ మొదటి వారంలోగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో అడాప్షన్ సెంటర్లు ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాల నియామక పక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇప్పటికే 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ కాగా మిగిలిన జిల్లాల్లో కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, దాని ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని పేర్కొన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి రూపాయిని సమర్థవంతంగా వినియోగించాలని మంత్రి అధికారులకు సూచించారు.

# తెలంగాణ విద్యారంగం బలోపేతానికి కృషి

మొదటిపేజీ తరువాయి

కానీ నా ప్రాధాన్యత ప్రాజెక్టులు కావు, పిల్లల చదువులే అని సీఎం అన్నారు. లక్షల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నా, ఉద్యోగానికి దరఖాస్తు రాసుకోలేని పరిస్థితి రాకూడదని, విద్యా ప్రమాణాలను పెంచడమే తమ నైతిక బాధ్యత అని స్పష్టం చేశారు. చిన్నతనంలోనే పిల్లలను హాస్టళ్లలో వేయడం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బ తింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంటరిగా పెరిగే పిల్లలు పెద్దయ్యాక తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులే తల్లిదండ్రుల స్థానంలో ఉండి పిల్లలకు సరైన మార్గదర్శనం చేయాలని పిలుపునిచ్చారు. ప్రత్యామ్నాయంగా, ప్రతి మండలాన్ని ఒక క్లస్టర్‌గా తీసుకుని విద్యా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. విద్యాబోధనలో అంతర్జాతీయ ప్రమాణాలు అందించేందుకు ఏటా 10 నుండి 12 మంది ఉపాధ్యాయులను 'స్టడీ లీవ్'పై విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. టీచర్ల ప్రమోషన్లు, బదిలీల బాధ్యతను తానే చూసుకుంటానని, అడగకుండానే ఒకటో తేదీన జీతాలు వేస్తున్నామని గుర్తుచేశారు. ఇదే క్రమంలో తన రాజకీయ ప్రస్థానంపై స్పందిస్తూ 2034 వరకు నేనే సీఎంగా ఉంటాను, ఎలాంటి సందేహాలు వద్దని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఎలాంటి అనుమానాలు, డౌట్లు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధీమా వ్యక్తం చేశారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయుల బృందంతో ఇవాళ ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

# నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం

- జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్ వ్యవసాయ చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రగుడు జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు
- ఐడీఓసీలో వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఆర్డీ పాస్ బుక్ ల పంపిణీ

రాజన్న సిరిసిల్ల, జూలై -30 ప్రజా దివాస్

సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ. సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నలకు ఏడాది పొడవునా పని కల్పించడంతో పాటు భద్రత, భీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం అధిక ధర చెల్లించాల్సి వచ్చినా నాణ్యమైన చీరలనే కొనుగోలు చేస్తోందని పేర్కొన్నారు. యార్న్ డిపో ఏర్పాటుతో చేనేత సహకార సంఘాలకు మరింత ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. నేతన్నల సమస్యలను ప్రజాప్రతినిధుల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

**నాణ్యమైన చీరల ఉత్పత్తి..**

సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్న ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిరిసిల్ల మోడల్ చీర మహిళలకు అందుబాటు ధరలో ఒకటి తయారు చేసి.. జీ ఐ ట్యాగ్ వచ్చేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2024--25 సంవత్సరానికి 6.80 కోట్ల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు ఇవ్వడం ద్వారా వేలాది మంది నేతన్నలకు ఎనిమిది నెలలపాటు ఉపాధి కల్పించామని తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు అందించామని, ఇప్పటికే దాదాపు కోటి మీటర్ల చీరల ఉత్పత్తి పూర్తైందని తెలిపారు. మరో మూడు కోట్లకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 62 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని వెల్లడించారు. నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు రూ.2 విద్యుత్ సబ్సిడీ అమలులోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమకు ఊతమిచ్చిందన్నారు. రూ.50 కోట్లతో వేములవాడ లో యార్న్ బ్యాంక్ ఏర్పాటు



చేశామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల వృత్తి గౌరవాన్ని చాటిచెప్పేలా సిరిసిల్ల కలెక్టరేట్ సర్కిల్ వద్ద రూ.3 కోట్లతో వస్త్రం తయారీ దశల విధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు నేతన్న వృత్తి గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. వారిపై గౌరవం, ప్రేమతో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.మహిళలు పండగలు, కార్యక్రమాలకు కట్టుకుంటున్నారు..

: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడ కు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా గుడి చెరువు బండ్ పార్క్ పనులను పూర్తి చేసి.. ప్రారంభించామని తెలిపారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు, రోడ్డు విస్తరణ, రోడ్డు భద్రత చర్యలు తీసుకున్నామని, వస్త్రం తయారీలో వివిధ దశలను తెలుసుకునేలా విగ్రహాలను ఏర్పాటు అయ్యాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరలు చాలా నాణ్యతతో తయారు చేశారని గుర్తు చేశారు. వాటిని మహిళలు పండగలు, ఇతర కార్యక్రమాలకు కట్టుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో సారి కూడా ఆర్డర్ ఇచ్చిందని తెలిపారుకార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఎస్సై జ్యోతి

ముస్తాబాద్ / జూలై 30 ప్రజా దివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ప్రజలు నేడు కురుస్తున్న వర్షాల దృశ్య అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జ్యోతి మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో 24 /7 డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ అందుబాటులో ఉందని విపత్తు సమయంలో సహాయం కోసం 100కు డయల్ చేసి తక్షణ చర్యలు పొందాలని జిల్లా ఎస్పీ ఆదేశాలతో మేరకు మండలంలో గల ప్రజలు వాగులు కాలువలు నదులు చెరువుల వద్దకు ప్రజలు వెళ్లవద్దని రైతులు పంట పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తలు ఉండాలని వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను గాని వైర్లను గాని చేతులతో ముట్ట రాదని వాహనదారులు రోడ్డుపై వాహనాలతో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని వర్ష ప్రభావం వల్ల రోడ్లు కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి వాహనాలు పడే ప్రమాదం ఉందని మండలంలోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ ఏదైనా సంఘటన జరిగితే వెంటనే 100 కు డయల్ చేసి సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని లేదా మండల రెవెన్యూ అధికారికి మండల అభివృద్ధి అధికారికి సమాచారం అందించాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# వేములవాడలోని విఆర్ఆర్ రైస్ మిల్‌పై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేసిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ

- సిఎంఆర్ బియ్యం అక్రమాలపై చర్యలు తీసుకోవాలని దండు వినోద్ డిమాండ్
- రైస్ మిల్లు యజమానుల ఆస్తులు జప్తు చేసి, జైలుకు పంపాలని విజ్ఞప్తి

వేములవాడ /ప్రజాదివాస్ జూలై 30




వేములవాడలోని 'విఆర్ఆర్ రైస్ మిల్' అక్రమాలపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు దండు వినోద్ కరీంనగర్ రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీకి ఆధారాలతో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దండు వినోద్ మాట్లాడుతూ, ఓ పార్టీ నాయకుని కుటుంబానికి చెందిన విఆర్ఆర్ రైస్ మిల్లు 2024-25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వానికి అందజేయాల్సిన దాదాపు రూ. 4 కోట్ల విలువైన 1232.773 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ (జబర్శీఏ వీఅశ్రీశ్రీవస =అషెవ) బియ్యాన్ని చెల్లించకుండా అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. బాధ్యులైన మిల్లు యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుని, వారి ఆస్తులను జప్తు చేయడంతో పాటు జైలుకు పంపాలని కోరారు రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్యాక్స్, ఐకేపీ, డీసీసీబీ కేంద్రాలకు తెస్తే చిన్న చిన్న కారణాలు చూపుతూ క్వింటాలుకు 8 నుండి 10 కిలోల వరకు తరుగు పేరిట కటింగ్ చేస్తూ రైస్ మిల్లర్లు తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఓవైపు రైతులను, మరోవైపు ప్రభుత్వాన్ని మిల్లర్లు నిలువునా దోచుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని, బిజెపి నాయకుడనే భయంతో చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారా అని ప్రశ్నించారు. రైతుల పక్షాన మాట్లాడే బిజెపి జిల్లా అధ్యక్షులు గోపి, ముందుగా తమ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చేసిన అక్రమాలపై సమాధానం చెప్పాలని, ప్రభుత్వానికి రావాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని తక్షణమే చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు.

# భగత్‌నగర్ దోపిడీ.. ఇంటి పెద్దల్లుడే దొంగ.. కరీంనగర్ దోపిడి కేసును చేధించిన పోలీసులు

- కొడుకుతో కలిసి దొంగతనానికి వ్యూహరచన ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు
- 43.67 గ్రాముల బంగారం, 64.98 గ్రాముల వెండి స్వాధీనం




కరీంనగర్ జిల్లా /ప్రజాదివాస్ జూలై 30

కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో ఇటీవల జరిగిన దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2.09 లక్షలు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.కేసు వివరాలను కరీంనగర్ సీపీ గౌష్ ఆలం వెల్లడించారు. ఈ నెల 21న అర్ధరాత్రి భగత్‌నగర్‌కు చెందిన అజ్మత్ అలీ ఇంట్లోకి చొరబడిన దుండగులు.. ఆయనతో పాటు భార్య, ఇద్దరు కుమార్తెలను డమ్మీ పిస్టళ్లు, కత్తులతో బెదిరించి తాళ్లతో కట్టేసి, 54 తులాల బంగారం, రూ.25 లక్షల నగదు, 30 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.దోపిడీ అనంతరం నిందితులు ఉపయోగించిన దొంగిలించిన బైక్‌లను హుజూరాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి సమీపంలో వదిలివెళ్లినట్లు గుర్తించారు. విచారణలో నిందితులు మీరట్‌కు చెందినవారని నిర్ధారించుకుని అక్కడి పోలీసుల సహకారంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సల్మాన్ అలియాస్ భూరే అలియాస్ యాదవ్, సల్మాన్ అలియాస్ విమాన్, మొహమ్మద్ హసీన్‌లను అదుపులోకి తీసుకున్నారు.

**అల్లుడు, మనుమడి స్కెచ్..**

నిందితులను విచారించగా అజ్మత్ అలీ అల్లుడు రజావుద్దీన్, మనుమడు అజీమ్ రజా ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారులుగా తేలినట్లు సీపీ తెలిపారు. రజావుద్దీన్‌పై గతంలో హత్య, ఆయుధాల కేసులతో పాటు ఇతర క్రిమినల్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. రజావుద్దీన్ భార్యతో కుటుంబ కలహాలు తలెత్తడంతో ఆమె గత ఏడాది పుట్టింటికి వచ్చింది. భార్యను తీసుకెళ్లేందుకు వచ్చిన రజావుద్దీన్ అక్కడే కొంతకాలం ఉండగా, అజ్మత్ అలీ కుటుంబ సభ్యులు అతడికి చికిత్స చేయించడంతో పాటు బట్టల వ్యాపారం ప్రారంభించేందుకు ఆర్థిక సాయం కూడా చేశారు.అయితే వ్యాపారంలో నష్టపోయిన అతడు తరచూ డబ్బులు డిమాండ్ చేస్తుండేవాడు. ఇటీవల రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేయగా నిరాకరించడంతో మీరట్‌కు వెళ్లిపోయాడు. మామ ఇంట్లో ఉన్న సమయంలో నగదు, బంగారు ఆభరణాల వివరాలను తెలుసుకున్న రజావుద్దీన్.. తన కుమారుడు అజీమ్ రజా, మరో ముగ్గురితో కలిసి దోపిడీకి పథకం రచించాడు. ఈ నెల 20న మీరట్ నుంచి రామగుండం చేరుకుని, 21వ తేదీ అర్ధరాత్రి డమ్మీ పిస్టళ్లు, కత్తులతో ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి దోపిడీకి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు.అరెస్టయిన ముగ్గురు నిందితులను మీరట్ కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకొస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్, అజీమ్ రజాతో పాటు ఇతర నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నట్లు సీపీ వెల్లడించారు.

9

# వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు...

రాజన్న సిరిసిల్ల జిల్లా /ప్రజాదివాస్ జూలై 30



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. వరదలు, వర్షాల వల్ల కలిగే నష్టాలు, అత్యవసర పరిస్థితులు లేదా ఇతర సమస్యలపై సమాచారం అందించేందుకు 9398684240 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజలకు సూచించారు. అవసరమైన సమాచారం అందిన వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

# కొండగట్టు ప్రధాన రహదారిపై కూలిన భారీ వృక్షం

**- రెండు వాహనాలు ధ్వంసం, ఒకరికి గాయాలు**

మల్యాల మండలం/ ప్రజాదివాస్ జూలై 30



జగిత్యాల-కరీంనగర్ ప్రధాన రహదారిపై ప్రమాదం చోటుచేసుకుంది. కొండగట్టు శివారులోని మెహర్ బాబా ఆలయం ఎదురుగా రోడ్డు పక్కన ఉన్న ఒక భారీ వృక్షం అకస్మాత్తుగా కూలిపోయింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న రెండు వాహనాలపై ఈ చెట్టు పడడంతో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. రహదారికి అడ్డంగా చెట్టు కూలిపోవడంతో ఆ మార్గంలో కొంతసేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై పడిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

# సూపర్ ఎల్ నినోపై అప్రమత్తం చేయాలి

- రిజర్వాయర్లలో నీటిని తాగునీటికి వినియోగించాలి

**- రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి**

**- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి**

**- జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**- సూపర్ ఎల్ నినో పై వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీ లో మంత్రుల సమీక్ష**

రాజన్న సిరిసిల్ల జిల్లా /ప్రజాదివాస్ జూలై 30



సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు.సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు. జిల్లా ఎల్ నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.జిల్లా పరిధిలోని ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి? వాటిలో నీటిమట్టం? జిల్లాలో ఎన్ని ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు? మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా? విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు...

## కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలిపోయింది

ముస్తాబాద్/ జూలై 30 ప్రజా దివాస్




రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లి గ్రామంలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మహమ్మద్ లాల్ బి పాత ఇల్లు కూలిపోవడం జరిగింది ఎలాంటి ప్రాణా నష్టం జరగలేదు ఈ సందర్భంగా మండల రెవెన్యూ అధికారి ఫారుక్ మాట్లాడుతూ మండలంలో పాత ఇళ్లలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాత ఇండ్లు వర్షానికి తడిసి కూలె ప్రమాదంలో ఉన్నచో సంబంధిత గ్రామపంచాయతీ సర్పంచ్ కి లేదా గ్రామ కార్యదర్శి సమాచారం అందించాలని గ్రామాల్లోని కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు

# వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

**- శిథిలావస్థలో ఉన్న భవనాలు, లో లెవెల్ కల్వర్టులు, రహదారుల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి**

**- ఆస్తి, ప్రాణ, పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించాలి**

**- కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన కలెక్టర్**

రాజన్న సిరిసిల్ల, జూలై -30 ప్రజా దివాస్

ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.అధికారులు తమ పరిధిలోని ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, భవనాలు, రహదారులు, లో లెవెల్ కల్వర్టులు తదితర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని తెలిపారు.లో లెవెల్ కల్వర్టులు, వాగులు, వంతెనలు, రహదారులపై నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రజలు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎక్కడైనా వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ లేదా పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.చెరువులు, కుంటలు, వంతెనలు, కాలువలు, లోతట్టు ప్రాంతాల వద్ద నీటి ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని జలాశయాల పరిస్థితులు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో తదితర వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, నీటిపారుదల, పోలీస్, విద్యుత్, ఆర్ అండ్ బీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.వర్షం కురిసిన తర్వాత డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ఖచ్చితంగా నిర్వహించాలని, ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, దోమల నియంత్రణపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు అర్హతను పరిశీలించి, నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, భూగర్భ జలాల పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.



ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు సరైన విధంగా అవగాహన కల్పించాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలి వర్షపు నీటిని వృథా కాకుండా సంరక్షించేందుకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.భూగర్భ జలాలు తక్కువగా ఉన్నందున బోర్లు వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

**కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వరదలు, నష్టాల వివరాలపై సమాచారం అందించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9398684240 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జెడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, సీపీఓ శ్రీనివాస చారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీల, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, పంచాయితీ రాజ్ ఈఈ సుదర్శన్, తదితరులు ఉన్నారు.

# మహాలక్ష్మితో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

**- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**- వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు మంత్రులు, ప్రభుత్వ విప్ శంకుస్థాపన**

**- కోరుట్ల మీదుగా సరకు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం**

వేములవాడ /ప్రజాదివాస్ జూలై 30






మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పక్కాగా అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ-- కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపడుతున్నామని వెల్లడించారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.రోజుకు 50 వేల మంది వేములవాడ బస్ స్టేషన్ నుంచి ప్రయాణం చేస్తున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి రూ. 11,668 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. 2600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 కోట్లతో బస్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగుల దాదాపు రూ.1000 కోట్ల పీఎఫ్ బకాయిలు, 600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించామని వెల్లడించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వరుణ పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే అభివృద్ధి దిశగా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు.ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఈ ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గతంలో పలుమార్లు కూలిపోయిన బస్‌స్టేషన్ సమీప వంతెనను భూ నిర్వాసితులకు న్యాయం చేసి పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని మంత్రుల ఆకాంక్ష.. వైభవంగా ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగ హోమం

- వేములవాడలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, ధారాభిషేకాలు
- పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

వేములవాడ/ప్రజాదివాస్ జూలై 30
వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న వరుణయాగం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన అతిథులకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని ప్రముఖులకు అందజేశారు. అనంతరం ప్రజాప్రతినిధులు ఆలయ అర్చకులు, వేద పండితులకు వర్ని సమర్పించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే జూలై 30 నుండి ఆగస్టు 1 వరకు భీమేశ్వర స్వామి ఆలయంలో సత్వర సద్యఃసువృష్టి కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. మొదటి రోజు కార్యక్రమాల్లో స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ జపాలు, వరుణయాగ హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. మూడు రోజుల పాటు దేవస్థాన అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు, విరాటపర్వ పారాయణాలు కొనసాగనున్నాయి. అనంతరం యాగశాలలో మంత్రులు, ఎమ్మెల్యేలు వరుణయాగాన్ని అధికారికంగా



ప్రారంభించి, భీమేశ్వర సదన్ ఈశాన్య మూలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాలువాలతో మంత్రులను సత్కరించారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి రైతులు సస్యశ్యామలంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ లోకకళ్యాణ క్రతువు నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.
8

# ప్రణాళికాబద్ధంగా రాజన్న ఆలయ విస్తరణ పనులు

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్





వేములవాడ, జూలై- 30: ప్రజా దివాస్
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానాన్ని భక్తులకు మరింత సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు.రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల వరుణ యాగ ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు తదితర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి, విస్తరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం 2023-24లో రూ.50 కోట్లు, 2024-25లో రూ.100 కోట్లు కేటాయించగా, అనంతరం మరో రూ.99.40 కోట్లు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు.ప్రస్తుతం ఆలయ అభివృద్ధి పనుల్లో సుమారు 45 శాతం పూర్తయ్యాయని, మరో 10 నుంచి 12 నెలల్లో పూర్తి స్థాయిలో పనులు ముగించి, రాబోయే వెయ్యేళ్ల అవసరాలకు అనుగుణంగా రాజన్న ఆలయాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. భక్తుల సూచనలు, సలహాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.12 కోట్లతో వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ లో ఆధునిక పార్కు, భారీ శివుడి విగ్రహం, మొక్కలు, నటరాజ విగ్రహం పనులు పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే రూ.10 కోట్లతో బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనులు, రూ.47 కోట్లతో వేములవాడలో 80 అడుగుల రహదారి విస్తరణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు.భక్తులకు అన్నదాన సేవలను మరింత విస్తరించేందుకు రూ.35 కోట్లతో అన్నదాన సత్రం నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, వేములవాడ డిపోకు 20 కొత్త బస్సులు కేటాయించడం, అలాగే రూ.1.60 కోట్లతో తిప్పాపూర్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# వేములవాడ రూపురేఖలు మార్చుతున్న అభివృద్ధి పనులు.. ట్యాంక్‌బండ్ పార్క్, ఆది యోగితో కొత్త గుర్తింపు

ప్రజల అవసరాలు, పర్యాటక ఆకర్షణ, ఆధ్యాత్మిక వైభవం లక్ష్యంగా వేగంగా మారుతున్న వేములవాడ






వేములవాడ/ప్రజాదివాస్ జూలై 30
వేములవాడ అభివృద్ధి పథంలో మరో ముందడుగు వేస్తోంది. రాజన్న సన్నిధికి వచ్చే భక్తులకు మరింత ఆహ్లాదకరమైన అనుభూతిని అందించేందుకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు పట్టణానికి కొత్త శోభను తీసుకొస్తున్నాయి. ట్యాంక్‌బండ్ పార్క్, ఆది యోగి విగ్రహం వంటి ప్రాజెక్టులు వేములవాడను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత బలోపేతం చేస్తున్నాయి.రాజన్న దర్శనానికి వచ్చే లక్షలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ప్రకృతి అందాలను ఆస్వాదించే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో ట్యాంక్‌బండ్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణం, కుటుంబాలతో గడిపే సౌకర్యాలు ఈ పార్క్‌ను ప్రత్యేక ఆకర్షణగా నిలబెట్టాయి.మరోవైపు ఆది యోగి విగ్రహం వేములవాడకు కొత్త గుర్తింపును తీసుకొచ్చింది. ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన ఈ నిర్మాణం భక్తులను, యువతను, పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. రాజన్న ఆలయ వైభవానికి తోడుగా ఈ ప్రాజెక్టు వేములవాడ ప్రతిష్ఠను మరింత పెంచుతోంది.ప్రజల కోసం చేపట్టిన ప్రతి నిర్మాణం, అభివృద్ధి కోసం చేస్తున్న ప్రతి ప్రయత్నం, భవిష్యత్ తరాల కోసం వేస్తున్న ప్రతి అడుగు వేములవాడను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దే దిశగా సాగుతోంది. మౌలిక వసతులు, పర్యాటక అభివృద్ధి, ఆధ్యాత్మిక కేంద్రాల విస్తరణతో పట్టణానికి కొత్త రూపాన్ని అందిస్తున్నారు.అందాల హరివిల్లుగా ట్యాంక్‌బండ్ పార్క్, ఆధ్యాత్మికతకు ప్రతిరూపంగా ఆది యోగి, సమగ్ర అభివృద్ధికి ప్రతీకగా వేములవాడ నిలుస్తోంది. అభివృద్ధి--ఆధ్యాత్మికత--పర్యాటకం అనే మూడు ప్రధాన స్తంభాలపై వేములవాడ భవిష్యత్తు మరింత వెలుగొందనుంది.టీవీ న్యూస్ ట్యాగ్ లైన్:

## "అభివృద్ధి అడుగులతో ముందుకు వేములవాడ.. ప్రజల కోసం నిర్మాణాలు, భవిష్యత్తు కోసం ప్రణాళికలు!"

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల జిల్లా/ ప్రజాదివాస్ జూలై 30
రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.వర్షాలు, వరదలపై సీఎస్ సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సీ ఎస్ మాట్లాడుతూ పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఈ వర్షాలు వరదలపై ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులంతా వారి వారి కేంద్ర కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లు 24 గంటలు పని చేయాలని అన్నారు. జిల్లాల వారిగా కురిసిన వర్షాలు, డ్యాం లలో చేరిన నీరు, దెబ్బతిన్న, రోడ్లు వంతెనలు, చేపట్టిన సహాయ చర్యల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగినట్లు సమాచారం అందితే తక్షణమే స్పందించాలని వివరించారు. గ్రామీణ స్థాయిలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు టామ్ టామ్ చేయాలని పేర్కొన్నారు.పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలలోనికి పశువుల కాపరులు, మత్స్యకారులు, ఇతరులు ఎవరు వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.డీజీపీ సీవీ



ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షాలు వరదల వల్ల ప్రజలు ఎవరికి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తుందని వివరించారు. పోలీసు శాఖ తరపున అవసరమైన సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గడ్డం, డీఆర్ఓ జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- మూల వాగు వద్ద దెబ్బతిన్న రోడ్డు
- నిజామాబాద్-మామిడిపల్లి మార్గంలో రాకపోకలు నిలిపివేత




కోనరావుపేట మండలం /ప్రజాదివాస్ జూలై 30
ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కోనరావుపేట మండలం నిజామాబాద్-మామిడిపల్లి గ్రామాలను కలిపే రహదారిపై ఉన్న మూల వాగు వద్ద రోడ్డు దెబ్బతినడంతో ఆ మార్గంలో రాకపోకలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కోనరావుపేట ఎస్సై కే ప్రశాంత్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి సంబంధిత ప్రదేశంలో బారికేడ్లు ఏర్పాటు చేసి, వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ దెబ్బతిన్న రహదారిపై ప్రయాణించవద్దని, ప్రత్యామ్నాయ మార్గాలను మాత్రమే ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న ప్రాంతాలను దాటేందుకు ప్రయత్నించవద్దని, పోలీస్ మరియు సంబంధిత శాఖల సూచనలను తప్పనిసరిగా పాటించి సహకరించాలని ఎస్సై ప్రశాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మరో అనాధ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన వీణ= ఫౌండేషన్... ఆర్థిక సహకారం అందించిన మాద్రి పృథ్వీరాజ్

ప్రజాదివాస్



పటాన్చెరు మండల పరిధిలోని భానూర్ సమీపంలో గుర్తు తెలియని ఓ మగ అనాధ మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. మృతుడి వివరాలు ఏవీ తెలియకపోవడంతో, మానవత్వాన్ని చాటుతూ వీణ= ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాద్రి పృథ్వీరాజ్ గారు ఆర్థిక సహకారం అందించి, అనాధలకు కూడా చివరి వీడ్కోలు గౌరవంగా ఉండాలనే సందేశాన్ని మరోసారి చాటిచెప్పారు. జీవితంలో సేవ. చివరి ప్రయాణంలోనూ గౌరవం, అనే లక్ష్యంతో వీణ= ఫౌండేషన్ తన మానవతా సేవలను నిరంతరం కొనసాగిస్తోంది.

## ప్రతి ఓటు విలువైనది... ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

ప్రజాదివాస్

పటాన్చెరు నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ాx=) కార్యక్రమంపై +వీ= ఫంక్షన్ హాల్ లో శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సమావేశంలో దీ=ా రాష్ట్ర నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని, ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యేలోపు ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లిం, క్రిస్టియన్, మిల్లర్స్, సెంట్రింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు వివిధ సామాజిక వర్గాల నాయకులతో నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించేందుకు పలు సూచనలు చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి కాలనీ, ప్రతి వీధి, ప్రతి ప్రార్థనా స్థలంలో ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ, పటాన్చెరు నియోజకవర్గాన్ని అత్యధిక నమోదు సాధించిన ప్రాంతంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## వేములవాడ బుడగ జంగాల కాలనీలో 30 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

- లోతట్టు ప్రాంత ప్రజలకు హరిమల గార్డెన్‌లో పునరావాసం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- బుడగ జంగాల కాలనీని పరిశీలించిన చైర్మన్, ఆర్డీఓ, డీఎస్పీ, కమిషనర్
- ఆపద వస్తే వెంటనే సమాచారం ఇవ్వండి: చైర్మన్ పుల్కం రాజు

వేములవాడ / ప్రజాదివాస్ జూలై 30



గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వేములవాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. ముఖ్యంగా 13వ వార్డు పరిధిలోని కొనాయిపల్లి రోడ్డులో ఉన్న బుడగ జంగాల కాలనీని వర్ద నీరు చుట్టుముట్టడంతో కాలనీ పూర్తిగా జలమయమైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులను కాపాడేందుకు మున్సిపల్ యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగింది. వరద ముప్పు పెరిగే ప్రమాదం ఉండటంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా దాదాపు 30 కుటుంబాలను మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. తాత్కాలిక పునరావాస కేంద్రమైన హరిమల గార్డెన్‌కు తరలించి ప్రాథమిక వసతులను కల్పించారు. అయితే పరిస్థితిని తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆర్డీఓ కే.ఎస్.బి. కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌లతో కలిసి జలమయమైన 13వ వార్డు కాలనీ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హరిమల గార్డెన్‌లోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు కల్పిస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. వర్షాల ఉద్ధృతి దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకే కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పుల్కం రాజు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ప్రతికూల వాతావరణంలో అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ధైర్యాన్నిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం ఎదురైతే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, తహసిల్దార్ జయంత్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, టిబిపిఓ వినోద్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుకుమార్, మున్సిపల్, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# ఆఫీసర్స్ బి కేర్‌ఫుల్..

- అధికారులకు సెలవులు రద్దు అత్యవసరమైతేనే అనుమతి
- అధిక వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం
- కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు - 08468-220069
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నందున అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, అత్యవసరమైతే తప్ప సెలవులు మంజూరు చేయబోమని స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి చర్యలు తీసుకునేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ (08468-220069) ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, మండలాల వారీగా వర్షాల పరిస్థితిపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎక్కడెక్కడ నీటి ప్రవాహం ఎక్కువగా ఉందో, ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయో తెలుసుకుని తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని సూచించారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రోప్స్, డ్రోన్లు వంటి అవసరమైన పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వర్షాల అనంతరం అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ శాఖ, గ్రామ కార్యదర్శులు, ఎంపీవోలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువులు, కుంటలు, వాగులు, కల్వర్టుల వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాల్లో పైకప్పు లీకేజీలు లేదా ప్రమాదకర పరిస్థితులు ఉంటే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వర్షాల వల్ల దెబ్బతిన్న ఇళ్లలో ప్రజలు నివసించకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహించే ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలకు



అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు భారీ వర్షాల సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాదకర ప్రాంతాల్లో వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులు, పాముకాటు చికిత్సకు అవసరమైన మందులు అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విక్టర్, అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్.వై. గిరి, జడ్పీ సీఈవో చందర్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితులను కాపాడితే రూ.25 వేల నగదు బహుమతి..

- 'రహవీర్' - పీఎం రహత్ పథకాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించాలి
-కలెక్టర్ ఆశిష్ సంగవాన్

ప్రజాదివాస్

రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలను సకాలంలో కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రహవీర్ (రహ-వీర్)' 'పీఎం రహత్ (పీఎం రహత్)' పథకాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగవాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్రతో కలిసి ఈ రెండు పథకాల అమలు తీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి ప్రమాదం జరిగిన వెంటనే ప్రజలు భయపడకుండా స్పందించి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను గోల్డెన్ అవర్ గా పరిగణిస్తారని, ఈ సమయంలో సకాలంలో వైద్యం అందితే అనేక మంది ప్రాణాలను




కాపాడే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లోపు ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం రూ.25 వేల నగదు బహుమతి అందజేస్తుందని తెలిపారు. ప్రజల్లో మానవత్వాన్ని ప్రోత్సహించడం, ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందేలా చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.1.5 లక్షల వరకు పూర్తిగా క్యాష్‌లెస్ విధానంలో ఉచిత వైద్యం అందించే పీఎం రహత్ ( పీఎం రహత్ ) పథకం అమల్లో ఉందని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. పీఎం రహత్ పథకం ముఖ్యాంశాలురోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స. ప్రమాదం జరిగిన తేదీ నుంచి 7 రోజుల వరకు వైద్య సేవలు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స. జాతీయ రహదారులు మాత్రమే కాకుండా ఏ రహదారిపై జరిగిన ప్రమాదానికైనా వర్తింపు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రతి ఒక్కరూ లబ్ధిదారులు. రహవీర్ (గుడ్ సామర్థం రివర్స్ సేమ్ ) ముఖ్యాంశాలు ప్రమాద బాధితుడిని వెంటనే ఆసుపత్రికి చేర్చిన వ్యక్తికి రూ.25 వేల ప్రోత్సాహకం. సహాయం చేసిన వారికి పోలీసులు లేదా కోర్టుల వేధింపుల భయం అవసరం లేదు. సహాయకులకు చట్టపరమైన రక్షణ కల్పించబడుతుంది. ఒక వ్యక్తి సంవత్సరానికి గరిష్టంగా ఐదు సార్లు ఈ బహుమతి పొందే అవకాశం ఉంటుంది. ఈ రెండు పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రతి రోడ్డు ప్రమాద బాధితుడికి సకాలంలో వైద్యం అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, జిల్లా రవాణా అధికారి టి. సంతోష్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. వేంకటేశం తదితర అధికారులు పాల్గొన్నారు.

# కూలే ప్రమాదంలో ఉన్న పాత భవనాలు తొలగించాలి..

- యజమానులకు మున్సిపల్ అధికారుల నోటీసులు

ప్రజాదివాస్

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో కూలే ప్రమాదంలో ఉన్న పాత, శిథిలావస్థకు చేరిన భవనాలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా ఉన్న భవనాల యజమానులకు గురువారం నోటీసులు జారీ చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాల వల్ల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రాణనష్టం జరిగే అవకాశం ఉన్నందున, ఆయా భవనాలను వారం రోజులలోపు స్వచ్ఛందంగా కూల్చివేయాలని (డిస్మాంటిల్ చేయాలని) అధికారులు సూచించారు. గడువులోపు చర్యలు తీసుకోకపోతే మున్సిపల్ చట్టాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 46, 47వ వార్డు కౌన్సిలర్లు గెరిగంటి స్వప్న, లక్ష్మీనారాయణ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి (టిపిఓ) దేవరాజ్, టీపీబీఓ సాయికిరణ్, వార్డు అధికారి కిషోర్, సిబ్బంది జుబేర్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు ప్రమాదకర భవనాలను పరిశీలించి



యజమానులకు నోటీసులు అందజేశారు. ప్రజలు కూడా శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# పేరుకే కిరాణం...జోరుగా బెల్ట్ షాపులు జోరుగా కొనసాగుతున్న సిండికేట్ దందా

- సిండికేట్ నుండి ఎక్సైజ్ శాఖ అధికారులకు ముడుపులు
- పల్లెల్లో విచ్చలవిడిగా దుకాణాల నిర్వహణ
- చీప్ లిక్కర్ నుంచి అన్ని బ్రాండ్ల అమ్మకాలు
- కిరాణా దుకాణాల మాటున అడ్డగోలుగా దందా..
- నిత్యం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు..
- చేసిన కష్టం తగలేస్తున్నారని కుటుంబాల ఆవేదన
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖాధికారులు







ప్రజాదివాస్

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం ఆందోల్ మండలంలో ఊరూ వాడా బెల్టు షాపుల జోరు సాగుతోంది. మద్యం ఏరులైపారుతోంది. గుడికి బడికి తేడా లేకుండానే బెల్టుషాపుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం సాగుతోంది. ఇక వైన్ షాపులు బార్లను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం విక్రయించడంతో పాటు అధిక రేట్లకు అమ్మకాలు జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బెల్టుషాపు లేకుండా చేస్తామమని హామీ ఇచ్చారు. అయితే మద్యం షాపుల యాజమానులకు టార్గెట్లు పేరుతో గల్లీకో బెల్టుషాపులను నిర్వహిస్తూ పగలు,రాత్రి తేడా లేకుండా ఒక్కొక్క మద్యం బాటిల్పై అదనంగా రూ.40 నుంచి 60 వసూలు చేస్తూ మందు బాబుల జేబులు గుల్ల చేస్తున్నారు. దీనితో బెల్టుషాపుల దందా మూడు బాటిల్లు, ఆరు కాసులుగా తయారైంది. బెల్టుషాపులను అడ్డుకోవాలసిన ఎక్సైజ్ అధికారులుపట్టినట్లు వ్యవహరిస్తున్నారు. మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో మూడు పూలు ఆరు కాయలుగా మద్యం పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతుంది. బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా ఊరు వెలుస్తున్నాయి.చుక్క.. ముక్క..కిక్కు.. పల్లెల్లో నేడు ట్రెండ్గా మారిపోయింది. వేకువజాము మొదలు.. అర్ధరాత్రి వరకు.. చీప్ లిక్కర్ నుంచి కాస్లీ మందు వరకు.. ఏ బ్రాండ్ కావాలన్నా.. కేరాఫ్ బెల్ట్షాపులుగా పరిస్థితి తయారైంది. ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే బెల్ట్షాపుల ఊసే లేకుండా చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నేతలు నేడు అధికారంలోకి వచ్చాక మద్యం ధరలు పెంచడంతోపాటు విచ్చలవిడిగా పేద, సామాన్య మందుబాబుల 'బెల్ట్' తీస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.అందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలో శ్రీ దుర్గా వారాహి వైన్స్ వైన్స్ లో పట్టపగలే ఆటోలు బైకులు తేడా లేకుండా జోగిపేట సంబంధించిన వివిధ గ్రామాలకు సరఫరా చేస్తున్న వైనం. సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ శాఖ ముడుపులు ముడుతున్నాయేమో..? అనుమానం వ్యక్తం అవుతున్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్న, పెద్ద గ్రామాలు కలుపుకొని దాదాపు 150 వరకు బెల్ట్ దుకాణాలు ఉన్నాయి. వంటి సైతం బెల్టు దుకాణాలు ఉన్నాయంటే ఏ రేంజ్‌లో బెల్ట్ దుకాణాల హవా నడుస్తున్నదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. బెల్ట్ దుకాణాల వల్ల గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. చాలా వరకు కిరాణ దుకాణాల్లోనే బెల్ట్‌షాపులు నిర్వహిస్తుండడంతో ఎల్లప్పుడూ మద్యం అందుబాటులో ఉంటున్నది. బెల్టుషాపుల్లో సిట్టింగ్ సౌకర్యం, చికెన్, మటన్, తినుబండారాలుఅందుబాటులో ఉంటున్నాయి.

## కూలీతో పాటు మద్యం..

గ్రామాల్లో ప్రతి పనికి మద్యం ఇవ్వాల్సిందే. ఇదే క్రమంలో వరినాటు వేసేటప్పుడు కూలీలకు కూలితోపాటు మద్యానికి డబ్బులు ఇవ్వాల్సిందే. నాటు వేసిన కూలీలకు ఎకరాకు ఒక ఫుల్ బాటిల్ ఇ వ్వాలి. కలుపు దేవేటప్పుడు కూడా అదే పద్ధ తి. ఇలా ప్రతి పనికి డబ్బులతోపాటు మద్యం అలవాటుగా మారుతోంది. దీంతో బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయి.

## తెల్లారంగానే బెల్ట్ దుకాణాల వద్దకు..

గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు అందుబాటులో ఉండటంతో తెల్లవారంగానే మందుబాబుల బెల్ట్ దుకాణాల వద్ద తచ్చాడుతున్నారు. సా యంత్రం కూలీ డబ్బులు చేతికి రాగానే నేరు గా బెల్ట్ దుకాణాలకు వెళ్తున్నారు. మద్యంతోపాటు గుడుంబా కూడా బెల్ట్ దుకాణాల్లో అందుబాటులో ఉంటున్నది. దీంతో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్స్ నుంచి మాత్రమే మద్యాన్ని కొనుగోలు చేయాలి. ఎక్కువ మొ త్తంలో మద్యాన్ని ఇండ్లల్లో నిల్వ ఉంచుకోకూడదు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచితే మద్యాన్ని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తారు.ఇంతటి కఠినమైన నిబంధనలు ఉన్నా బహిరంగంగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకొని మ ద్యం అమ్ముతున్నారంటే అధికారుల నిర్లక్ష్యం కనబడుతున్నది. ప్రస్తుతాశీ అందోల్ మండలంలోని అన్ని గ్రామాలలో సిండికేట్ లో మందు తీసుకెళ్లి అమ్ముతున్నారు సిండికేట్లు ఒక క్వాటర్ పది రూపాయలు ఒక ఫూలుకు 40 రూపాయలు ఎక్కువగా తీసుకొని సిండికేటు లో బెల్ట్ షాపుల జోరు అకోల నాందేడ్ హైవే రోడ్డు ఇరువైపులా నడుస్తుందని అక్కడి స్థానికుల అంటున్నారు. మండలాల్లోని పలు గ్రామాల వ్యవసాయ పొలాల్లకి మద్యం క్రయవిక్రయాలపై నిబంధనలు అమలు అమలు చేస్తున్నట్టు అక్కడ ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఎక్సైజ్‌శాఖ చూసీ చూడనట్లు ఉండటం వెనుక కారణం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెద్దఎత్తున మద్యం దుకాణాల ద్వారా మామూళ్ల దందా జరుగుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మామూళ్ల కారణంగానే బెల్ట్ దుకాణాల దందా సవ్యంగా సాగుతుందని యువజన సంఘాల నేత లు అంటున్నారు.

## బెల్ట్ షాపులను అరికడతాం

గ్రామీణ ప్రాంతాల్లో వెలిసిన మద్యం బెల్ట్ దుకాణాలను అరికడతాం. ఇప్పటికే ఈ షాపులపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల నుంచి వస్తున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నాం. విచ్చలవిడిగా వెలుస్తున్నాయని ఎవరు ఫిర్యాదు చేసినా దుకాణాదారులపై చర్యలు తీసుకుంటున్నాం. కేసులు సైతం నమోదు చేస్తున్నాం. మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందినా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామీణ ప్రాంత ప్రజలు మద్యం బెల్ట్ దుకాణాల నుంచి ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడినా నేరుగా జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు.

# భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి..

- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు కీలక ఆదేశాలు



ప్రజాదివాస్

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు.భారీ వర్షాలు, వరదల పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీఎస్ సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా వర్షాల పరిస్థితి, సహాయక చర్యలు, వరద ప్రభావిత ప్రాంతాలు, రోడ్లు, వంతెనల పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలపై సమీక్ష నిర్వహించారు.సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు నమోదవుతున్నాయని, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లు 24 గంటలూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే వెంటనే వాటిని వినియోగించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, వాగులు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదల పరిస్థితుల్లో పోలీసు శాఖ అన్ని ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా అవసరమైన అన్ని సహాయక చర్యలకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ స్తంభాలను తాకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, శిథిలావస్థలో ఉన్న పాత భవనాల్లో నివసిస్తున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, ట్రైనీ కలెక్టర్ రవితేజ, జిల్లా పరిషత్ సీఈవో చందర్, డీఆర్ఓ పాండు, డీపీఓ మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రూ.32 కోట్ల చెక్‌డ్యామ్ పొంగిపొర్లింది..

- బీర్కూర్‌లో సందర్శించిన ఎమ్మెల్యే పోచారం




ప్రజాదివాస్

కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ శివారులో మంజీరా నదిపై రూ.32 కోట్ల వ్యయంతో ఇటీవల నిర్మించిన నూతన చెక్‌డ్యామ్ భారీ వర్షాల నేపథ్యంలో నీటితో నిండిపోయి పొంగిపొర్లుతోంది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలాశయంలోకి భారీగా వరదనీరు చేరడంతో చెక్‌డ్యామ్ అలుగు మీదుగా నీరు ప్రవహిస్తూ ఆకట్టుకుంటోంది.ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి చెక్‌డ్యామ్‌ను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం బ్రిడ్జిపై నుంచి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.పోచారం శ్రీనివాస్ రెడ్డి దూరదృష్టితో నిర్మించిన ఈ చెక్‌డ్యామ్ ఇప్పటికే పూర్తి స్థాయిలో నీటితో నిండిపోవడం పట్ల స్థానిక రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చెక్‌డ్యామ్ ద్వారా పరిసర గ్రామాలకు సాగునీటి లభ్యత పెరగడంతో పాటు భూగర్భ జలమట్టాలు కూడా గణనీయంగా పెరుగుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో మంజీరా నదిలో వచ్చే వరదనీటిని నిల్వ చేసి వ్యవసాయానికి ఉపయోగపడేలా ఈ నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తుమ్మనపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి ఆరుగురు అరెస్టు

ప్రజాదివాస్




ఝరాసంగం మండలం తుమ్మనపల్లి గ్రామ శివారులోని ఓ రేకుల షెడ్డు వద్ద పేకాట నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు.దాడి సందర్భంగా ఝరాసంగం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. అరెస్టయిన వారిలో ఎల్చల్ నవాజ్ రెడ్డి, షేక్ సోహెల్, పట్లోళ్ల సురేష్, పిల్లోడి సాయికుమార్, మీదిదొడ్డి శ్రీనివాస్, ఎం.డి. ఫయాజ్ ఉన్నారు.వారి వద్ద నుంచి రూ.24,440 నగదుతో పాటు పేకముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలు జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఇలాంటి అక్రమాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎస్సై క్రాంతి కుమార్ పటేల్ తెలిపారు.

# సరైన సినిమా కోసమే రెండేళ్లు గ్యాప్ తీసుకున్నా: వరుణ్ తేజ్



రెండేళ్ల విరామం అనంతరం 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు హీరో వరుణ్ తేజ్ . తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన వరుణ్.. సినిమా గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సరైన చిత్రం కోసమే రెండేళ్లు గ్యాప్ తీసుకున్నట్లు వెల్లడించారు. " ఈ బ్రేక్ నిజంగా కావాలని తీసుకున్నది కాదు. ఎలాంటి పాత్రలు చేయాలనేదానిపై క్లారిటీ తెచ్చుకోవడానికే రెండేళ్లు బ్రేక్ తీసుకున్నా. ఏదో ఒక సినిమా అని చేయడం నాకిష్టం లేదు. కథని బాగా నమ్మితేనే చెయ్యాలనుకుంటున్నా. డైరెక్టర్ మేర్లపాక గాంధీ 'కొరియన్ కనకరాజు' కథ చెప్పినప్పుడు అది చాలా కొత్తగా అనిపించింది. రెండేళ్ల తర్వాత రీఎంట్రీ ఇవ్వడానికి సరైనదనిపించింది. ఇదొక ఇండో - కొరియన్ హారర్ కామెడీ చిత్రం. ఇలాంటి సినిమా ఇండస్ట్రీలో ఇంతకుముందు ఎవరూ ట్రై చేయలేదు. అందుకే ఓకే చెప్పా.ప్రతి కొత్త పాత్ర ఒక సవాలే. కనకరాజు వినోదాన్ని పంచే పాత్ర. నాకు పూర్తి వ్యతిరేకం. అనంతపురం, రాయలసీమ యాసను నేర్చుకోవడం, కొరియన్ భాషలో పెద్ద డైలాగ్స్ చెప్పడం టాస్క్ అనిపించింది. కొరియన్ భాష తెలియకపోవడంతో పదాలను పలకడం, మాట్లాడడం ఇబ్బంది అనిపించింది. ఈ పాత్రకోసం ఫిజికల్‌గా పెద్ద కష్టం లేకపోయినా డ్యాన్స్, లుక్ కోసం కష్టపడ్డాను. డిఫరెంట్ లుక్ కావాలని జుట్టు పెంచా. సినిమాలో ఈ క్యారెక్టర్ బాగా నవ్విస్తుంది. మేము ఎంత ఎంజాయ్ చేసి తీసామో, ప్రేక్షకులు కూడా అంతే ఎంజాయ్ చేస్తారని అనుకుంటున్నా" అని వరుణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక, ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ అలరించనున్నారు. ఈ సినిమా ఆగస్టు 7న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# సిందులేద్దామా.. ఒకటిగా అడుగేద్దామా..



ధనుష్, సాయి పల్లవి, శ్రీలీల ప్రధాన పాత్రల్లో రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఓం చాప్టర్ 1: ఉదిరం- ది బ్లడ్ వుడ్'. మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. వుండర్‌బార్ ఫిల్మ్స్ నిర్మిస్తుంది. మంగళవారం ధనుష్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి 'అలాకా లూవా' అనే గీతాన్ని సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది చిత్రబృందం. 'సిందులేద్దామా.. అందరం ఒక్కటిగా అడుగేద్దామా.. దెబ్బలు తగిలే.. తగిలే.. అరె నిప్పులు మరిగె మరిగె.. ఒక ఉప్పెన ఉరిమె..' అంటూ సాగుతున్న ఈ పాట ఆకట్టుకుంటోంది. సాయి అభ్యంకర్, రామ్ మిరియాల, అరుణ్ ఆలపించిన ఈ గీతానికి చంద్రబోస్ సాహిత్యం అందించారు. ఈ సినిమా అక్టోబరు 16న విడుదల కానుంది.

# రిషబ్ శెట్టికి ఐఎఫ్‌ఎఫ్‌ఎం 'లీడర్‌షిప్ ఇన్ సినిమా' అవార్డ్



'కాంతార' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్ శెట్టి . తాజాగా ఆయనకు అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవం దక్కింది. ఆస్ట్రేలియాలోని 'ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ మెల్‌బోర్న్' 2026లో 'లీడర్‌షిప్ ఇన్ సినిమా' అవార్డుకు ఆయన ఎంపికయ్యారు. ఆగస్టు 13న మెల్‌బోర్న్‌లో జరిగే వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై పురస్కారాన్ని అందుకోనున్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే కథలను ప్రపంచానికి చాటిచెప్పినందుకు ఐఎఫ్‌ఎఫ్‌ఎం ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అరుదైన గౌరవం దక్కడం పట్ల రిషబ్ ఆనందం వ్యక్తం చేశారు."ఈ అవార్డుకు ఎంపికకావడం ఎంతో గర్వంగా భావిస్తున్నాను. సంస్కృతి, సంప్రదాయాలను చూపించడానికి నేను ఎప్పుడూ కథలనే మార్గంగా ఎంచుకుంటాను. మన మూలాలకు సంబంధించిన కథలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు చేరడం ఎంతో సంతోషాన్నిస్తోంది. మెల్‌బోర్న్ వేడుకల్లో తోటి సినీ ప్రముఖులు, ప్రేక్షకులతో కలిసి పాల్గొనేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని పేర్కొన్నారు.



# చెప్పిన తేదీకే వస్తుంది

'ఇరుముడి' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు రవితేజ. శివ నిర్వాణ తెరకెక్కించిన ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించిన సంగతి తెలిసిందే. ఇది ఆగస్టులో తెరపైకి రానున్న నేపథ్యంలో.. విడుదల వాయిదా పడే అవకాశమున్నట్లు నెట్టింట ఊహాగానాలు మొదలయ్యాయి. దీంతో ఈ అంశంపై చిత్ర నిర్మాణ సంస్థ స్పష్టత ఇచ్చింది. ఈ సినిమా అనుకున్న సమయానికే ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని తెలియజేస్తూ.. ఓ కొత్త పోస్టర్‌ని నెట్టింట పంచుకుంది. అందులో రవితేజని బేబీ నక్షత్ర వెనక నుంచి ఆప్యాయంగా హత్తుకుని కనిపించింది. తండ్రీ - కూతుళ్ల అనుబంధాలతో నిండిన యాక్షన్ చిత్రమిది. ప్రస్తుతం నిర్మాణాంతర పనులు ముగింపు దశలో ఉన్నాయి. త్వరలో రెండో పాట విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ.

# ఒడిలో కూర్చోవాలని బలవంతం చేసేవాడు.. లైంగిక వేధింపులపై నటి



రియాలిటీ షో 'లాకప్ 2' వేదికగా నటి శివాంగి జోషి తన చిన్ననాటి భయానక అనుభవాన్ని పంచుకుని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. చిన్నతనంలో తన బంధువే తనతో అసభ్యంగా ప్రవర్తించారని తెలిపారు."మావయ్య వరుస అయ్యే వ్యక్తి నన్ను స్కూల్ నుంచి తీసుకువచ్చేవాడు. మా అమ్మ అతడిని ఎంతో నమ్మేది. ఆ నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని అతడు నాతో అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఇండస్ట్రీలోకి వెళ్లాలంటే.. డ్రైవింగ్ నేర్చుకోవాలని, ఏవేవో చేయాలని తన ఒడిలో కూర్చోబెట్టుకుని సంబంధం లేని విషయాలు మాట్లాడేవాడు. ఏం జరుగుతోందో, ఆయన ఉద్దేశం ఏమిటో నాకు అర్థం కాలేదు. నా తల్లిదండ్రులు ఇంట్లో లేనప్పుడు లైంగిక వేధింపులకు యత్నించాడు. విషయం తెలిసి అమ్మానాన్న అతడిని ఇంటి నుంచి గెంటేశారు" అని చెబుతూ శివాంగి భావోద్వేగానికి గురయ్యారు.

# కామారెడ్డి జిల్లాలో మహిళకు మోసం నగదు లెక్కిస్తామని చెప్పి 15వేలతో ఉడాయింపు

కామారెడ్డి జిల్లాలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఓ మహిళను దొంగలు మోసం చేసి నగదు కాజేశారు. డబ్బులు లెక్కపెడతామని నమ్మించిన దుండగులు, మహిళ వద్ద ఉన్న నోట్ల కట్టలో నుంచి రూ.15 వేలను చాకచక్యంగా మాయం చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన పూజ అనే మహిళ బ్యాంకు పనుల నిమిత్తం కామారెడ్డిలోని ఎస్‌బీఐ శాఖకు వెళ్లింది. బ్యాంకులో నగదు లెక్కపెడుతున్న సమయంలో కొందరు వ్యక్తులు ఆమెను గమనించారు. అనంతరం ఆమె వద్దకు వెళ్లి డబ్బులను సరిగ్గా లెక్కపెడతామని, నోట్లను పరిశీలిస్తామని నమ్మబలికారు. వారి మాటలను నమ్మిన పూజ తన వద్ద ఉన్న నగదును వారికి ఇచ్చింది. ఈ క్రమంలో దుండగులు ఏమాత్రం అనుమానం రాకుండా వ్యవహరించి, నోట్ల కట్టలో నుంచి రూ.15 వేల నగదును తీసేశారు. అనంతరం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత నగదు తక్కువగా ఉన్నట్లు గుర్తించిన బాధితురాలు మోసపోయానని గ్రహించింది. ఆమె ఫిర్యాదు మేరకు బ్యాంకులో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల వివరాలను సేకరిస్తున్నారు. బ్యాంకుల్లో నగదు లావాదేవీలు నిర్వహించే సమయంలో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని బాధితురాలికి పోలీసులు ధైర్యం చెప్పారు.

# 'లెనిన్'లో ఐటెంసాంగ్.. రష్మికతో ప్లాన్ చేశాం, కానీ: తమన్





మూడేళ్ల విరామం తర్వాత 'లెనిన్'తో అఖిల్ ప్రేక్షకులను అలరించారు. ఈ సినిమాలో తమన్ కంపోజ్ చేసిన పాటలకు మంచి ఆదరణ లభించింది. ఈ సినిమాలో ఓ ఐటెం సాంగ్ ప్లాన్ చేశారట. చివరి నిమిషంలో దాన్ని తీసేయాల్సి వచ్చిందని.. తమన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు."ఈ సినిమాలో ఒక ఐటెం సాంగ్ పెట్టాలని అనుకున్నాం. కంపోజ్ కూడా చేశా. పాట షూటింగ్ ప్రారంభిద్దామనుకునే సమయానికి.. కథకు ఐటెం సాంగ్ సెట్ కాదని భావించారు. దీంతో తొలగించారు. నాకు కోపం వచ్చింది. ఆ బాధలో సినిమాకు సంబంధించిన నాలుగైదు వాట్సప్ గ్రూప్‌ల నుంచి వైదొలిగాను. మంచి రాయలసీమ యాసలో ఉంది పాట. హిట్ అవుతుందనుకున్నా. ఈ సాంగ్ కోసం రష్మిక , పూజా హెగ్డే, కయాదు లోహర్, ప్రీతి ముకుందన్ పేర్లు కూడా పరిశీలించారు. కానీ, ఆ పాట పెడితే సినిమా కథ మారిపోతుంది. నెగెటివ్ రివ్యూలు రాస్తారు. దీంతో చివరి నిమిషంలో తీసేశారు" అని తెలిపారు.

**అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి తమన్..**

మెగా 158: 40 శాతం షూటింగ్ పూర్తయింది. సంక్రాంతికి రావొచ్చు. ఇటీవల ఓ వీడియో చూశా. అందులో చిరంజీవి అదిరిపోయారు. దాని గురించి ఆగస్టు 22న మాట్లాడదాం. కచ్చితంగా బ్లాక్‌బస్టర్ అవుతుంది. ఓజీకి డబుల్ ఉంటుంది.

ఎన్‌బీకే 111: విజువల్స్ మరోస్థాయిలో ఉంటాయి. కొత్త బాలకృష్ణను చూస్తారు. థియేటర్‌లో రచ్చరచ్చే. టైటిల్ చాలా క్రేజీగా ఉంటుంది. డిసెంబర్‌లో రిలీజ్ అవుతుంది.